**కథ**

# కలడు కలండనెడి వాడు...

**వసుంధర**

కలడందురు దీనులయెడ
కలడందురు పరమయోగి
గణముల పాలం
కలడందురన్ని దిశలను
కలడు కలండనెడివాడు .కలడో
లేడో!

ఈ మీమాంస వేల సంవత్సరాల క్రితానిదైనా ఇప్పటికీ కొనసాగుతూనే వుంది. వీళ్ళకి నేను అసలున్నానా లేదా అన్న సందేహం దేవుడినైన నన్నే పట్టి పీడి స్తోంది.

నేను లేని చోటు లేదు. నాకు రూపం లేదు. గుణం లేదు. రాగద్వేషాలు లేవు అని మనుషులం టారు. నాకు పేరు కూడా లేదు. మనుషులే నన్ను దేవుడన్నారు.

మనుషులు ఈ సృష్టి నాదన్నారు. దాంతో రాగ ద్వేషాలకు అతీతుడిననిపించుకున్న నాకు సృష్టి అంటే మమకారం పుట్టింది. సృష్టిలోని ప్రతి ప్రాణి అవసరాలూ తీరడానికి ఎన్నో ఏర్పాట్లు చేసాను. మనుషులు నన్ను దేవుడని ఊరుకోకుండా నాకు పూజలు చేయడం కూడా మొదలుపెట్టారు. అందువల్ల నాకు మనుషులంటే బలహీనత ఏర్ప డింది. నా అద్భుత శక్తులన్నీ క్రమంగా వారి మేలు కోసమే ఉపయోగపడసాగాయి. ప్రకృతి రహస్యా లను ఒకటొక్కటిగా ఛేదించడంలో మనిషికి నేను సాయపడ్డాను. ఇప్పుడు మనిషి ఈ సృష్టినే తన అదుపులోకి తీసుకుని ఇతర ప్రాణులనూ, ప్రకృతి శక్తులనూ తనకు బానిసల్ని చేసుకున్నాడు.

దేవుడొక్కడే అని మనుషులం టారు కానీ మనుషులందరూ ఒక్కటి కానంత కాలం దేవుడూ ఒక్కటి కాలేడు. మనుషుల్లో దేశం, ప్రాంతం, మతం, వర్ణం, భాష, కులం వగైరాలతో ఎన్నో విభాగాలు న్నాయి. ప్రతి విభాగానికీ ఓ దేవుడు న్నాడు. ఆ దేవుళ్లకు కులాలు లేకపో యినా మతాలున్నాయి. ఆ మతాలన్నీ ప్రేమనూ, శాంతినీ ప్రబోధిస్తు న్నాయి.


దేవుడు ప్రేమ మూర్తి. మతాలు ప్రేమను ప్రబోధిస్తాయి. కానీ భూమ్మీద జరిగే ఘోరాలు, నేరాలు, అల్లర్లు చాలావరకూ నా పేరుతోటే, మతాల కోసమూ జరిగాయి, జరుగు తున్నాయి. ఇది నాకు చిత్రంగా ఉంది.

మనుషులు సుఖశాంతులతో జీవించాలన్నది దేవుడి ఆశయమని మనుషులకు తెలుసు. కానీ నా పేరే చెబుతూ వారు భూమ్మీద సుఖశాంతులకు భంగం కలిగిస్తున్నారు. సర్వాంర్యామి నయుండీ అద్భుతశక్తులను కలిగుండీ కూడా మనుషులను అదుపుచేయడం నా వల్లకావడం లేదు. మనిషి సృష్టి రహస్యాలను ఛేదించి ప్రయోజనం పొందుతు న్నాడు. ఉత్కృష్టస్థాయిని చేరుకుని కూడా నన్నే సృష్టికర్తగా గౌరవిస్తున్నాడు. ఆ మనిషి బుద్ధి పెడదా రులు పడుతూంటే ఆపడం నా కర్తవ్యం. అందుకు మనిషి రహస్యాన్ని నేను ఛేదించాలి.

ఏమిటి మనిషి రసహ్యం?

నేను మనుషుల గురించి ఆలోచించసాగాను.

మనుషులకు ఒకరా ఇద్దరా బోలెడు దేవుళ్లు. ప్రతి మనిషీ దేవుణ్ణి నమ్ము తాడు కానీ తను నమ్మిన దేవుడే అందరికీ ఆరాధ్యదైవం కావాలం టాడు. దేవుడొక్కడే అంటూనే ఇతర దేవుళ్లను ద్వేషిస్తాడు. దీనికంతకూ కారణం దేవుడినతడు తన మేధా శక్తితో



ఊహించాడే తప్ప ఎన్నడూ కళ్లారా చూడలేదు. నేను మనిషికి కనిపించి నేరుగా మాట్లాడి అతడికి దేవుడి గురించి ఉన్న అపోహలు పోగొట్టాలనుకున్నాను.

ఏ మనిషికి కనిపించాలీ అన్నది నా తదుపరి సమస్య.

జాతిని ప్రభావితం చేస్తున్న నాయకులున్నారు. వారిలో ఏ ఒక్కరితో మాట్లాడినా నా సందేశం మానవాళిని చేరుకుంటుంది. కానీ ఆ నాయకులు ఎంత శక్తిమంతులంటే సందేశం నాదే ఐనా ప్రభావం వారిదే అవుతుంది. అందువల్ల నేను వారి



ప్రచారసాధనంగా మారిపోతాను. అడుసు తొక్కుతూ కాళ్లు కడుగుతూ అదే జీవిత పరమావధిగా భావించే ఆ నాయకుల వల్లనే భూమ్మీద తరచుగా యుద్ధాలూ, శాంతి ప్రయత్నాలూ జరుగుతుంటాయి. ఐతే ఆ నాయకులకు అధికార యోగమొక్కటే నిజం. అంతకు మించిన నిజం గురించి తెలుసుకునే యోచన వారికుండదు. అలాంటి వారి వల్ల నేనాశించే ప్రయోజనం సిద్ధించదు.

సర్వసంగపరిత్యాగులున్నారు. కానీ వాళ్లు దేవుడికి దగ్గరయ్యే ప్రయత్నంలో జనసామాన్యానికి దూరమయ్యారు. ప్రజలు వారి సందేశాలను దూరం నించే వింటారు. వాటికి దూరంగా ఉంటారు. పోనీ నేనే మరో అవతారమెత్తి నేరుగా ప్రజల మధ్యకు వెళ్లొచ్చు. కానీ ఇంతవరకూ ఏ అవతారమూర్తీ మొత్తం మానవాళిని ప్రభావితం చేయలేదు. నా కొత్త అవతారం దేవుళ్ల జాబితాను పెంచుతుందే తప్ప మనుషులందర్నీ ఒక్కటి చేయలేదు.

ఇది ప్రజాస్వామ్య యుగం కాబట్టి నేనే నేరుగా వివిధ రూపాలతో మొత్తం భూమ్మీద మనుషులందర్నీ ఒకేసారి ఒక్కరోజులో కలుసుకుని నా సందేశాన్ని నేనే ప్రచారం చేసుకోవచ్చు. ఐతే అంత పెద్ద ప్రయోగానికి ముందు శాంపుల్ టెస్ట్ అవసరం.

నా దృష్టిలో మనుషులు నాయకులు, సామాన్యులు, నాస్తికులు, ఆస్తికులు, వివేకవంతులు అని ఐదు రకాలు.

వీరిలో నాయకులు కావడానికి అల్ప సంఖ్యాకులే! కానీ పీల్చే గాలిలో బొగ్గుపులుసు వాయువులా భూమ్మీది పచ్చతనానికీ కాలుష్యానికీ కూడా కారకులవుతున్నారు.

సామాన్యులది గొర్రెలమంద తరహా. పీల్చే గాలిలో నత్రజనిలా మనుషుల్లో వీరి శాతమే ఎక్కువ. భూమ్మీద జరిగే విశేషాల్లో కర్మ, క్రియ మాత్రమే వీరిది. దేనికీ కర్తలు కారు.

మనం పీల్చ గాలిలో మీథేన్‌లో మనుషుల్లో నాస్తికుల శాతం చాలా తక్కువ. సమాజంపై వీరి ప్రభావమూ ఆ మేరకే ఉంటుంది.

మనం పీల్చ గాలిలో ప్రాణవాయువులా మనుషుల్లో సామాన్యుల తర్వాత ఆస్తికుల శాతమే ఎక్కువ. వీరు నన్ను నమ్మి అన్నింటికీ నా మీదే ఆధారపడతారు. అటు సామాన్యుల్ని ప్రభావితం చేస్తూ, ఇటు నాయకులకు ప్రేరణగా ఉంటూ భూమ్మీద జరిగే మంచికీ, చెడుకూ వీరే కారణభూతులవుతున్నారు.

ఇక వివేకవంతుల్ని తీసుకుంటే వీరిలో కొందరు ఆస్తికులు, కొందరు నాస్తికులు. అహాన్ని జయించి, మానసిక ధైర్యం పెంచుకుందుకు మాత్రమే వీరు దేవుణ్ణో, హేతువాదాన్నో నమ్ముతారు.

ఈ ఐదు రకాల్లో నేను తలపెట్టిన ప్రయత్నానికి ఆస్తికులే వీలు. మేలు. ఆ ఆస్తికుల్లోంచి మచ్చుకి నరసయ్యను ఎన్నుకున్నాను. ఫలితాన్నిబట్టి తదుపరి కార్యక్రమాన్ని నిర్ణయించాలనుకున్నాను. ఆపరేషన్ నరసయ్య- అదీ నా ప్రస్తుత కార్యక్రమం!

నరసయ్య ప్రభుత్వోద్యోగి. అతడిది చిన్న కుటుంబం. పట్నంలో స్వంతింట్లో మకాం. భార్య అనుకూలవతి కావడంతో తల్లిదండ్రులూ అతడితో ఉంటున్నారు. కూతురు, కొడుకు ఇంగ్లీషు మీడియం స్కూల్లో చదువుతున్నారు. చెప్పుకోదగ్గ ఆర్థిక సమస్యలు లేని నరసయ్యకింకా చాలా ఏళ్ల సర్వీసుంది.

నరసయ్య ప్రతి రోజూ ఉదయం స్నానంతరం దైవపూజ చేస్తాడు. ఏ కష్టం వచ్చినా దేవుడికి మొక్కుకుంటాడు. ప్రతి సాయంత్రమూ గుడికి వెళతాడు. అన్నార్తుడికి పైసా దానం చేయాలంటే తటపటాయించినా- దైవకార్యాలకు చందాలివ్వడానికి వెనకాడడు.

ప్రతిరోజూ గుడికి వెళ్లి లోపలి ఆవరణలోని అందమైన పూలతోటలో కాసేపు కూర్చోవడం అతడికి రివాజు. ఒక రోజున ఆ పూలతోటలోనే నేనతడి ప్రక్కన కూర్చుని, ''నమస్కారం నరసయ్యా, బాగున్నావా?'' అన్నాను.

## చారిత్రాత్మకం

**కొన్ని చిత్రాలు జనం మదిలో బాగా గుర్తుండిపోతాయి. కొత్తదనంతో కూడిన కథనంతో అందర్నీ అలరించేలా చిత్రాలు తీయడం కత్తిమీద సామే. స్టార్ హీరోగా తన సత్తాని నిరూపించుకుంటున్న రజనీకాంత్ కొత్త చిత్రం శివాజీలో పాత్ర లభించడం తన అదృష్టం అంటోంది శ్రీయ. ఎ.ఆర్.రెహమాన్ సంగీతం సమకూరుస్తుండడం విశేషం. ఎన్వి.ప్రసాద్ తెలుగు డబ్బింగ్ హక్కుల్ని పొందిన ఈచిత్రం త్వరలో షూటింగ్ ప్రారంభించుకోనుంది.**

నరసయ్య నా వంక ఆశ్చర్యంగా చూసి, ''నిన్నెక్కడా చూసిన గుర్తు లేదే?'' అన్నాడు.

''చూడ్డానికిదే మొదటిసారి కానీ నువ్వు నన్ను రోజూ తల్చుకుంటూనే ఉంటావు'' అన్నాను నర్మగర్భంగా.

నరసయ్య నన్ను పట్టి పట్టి చూస్తుంటే ''అలా చూడకు. కాసేపు కబుర్లాడుకుంటే నేనెవరో అదే గుర్తొస్తుంది కానీ ముందిది చెప్పు. నాన్నకు పెద్ద జబ్బు చేసి తగ్గింది కదా. ఇప్పుడు తేలిగ్గా లేచి తిరుగుతున్నాడా? అమ్మకు బెంగ తగ్గి మనసు కుదుటపడిందా?'' అన్నాను చనువుగా.

వ్యక్తిగత విషయాలడిగినా కూడా నరసయ్య నన్ను అపరిచితుడిగానే చూసాడు. మర్యాదకన్నట్టు ఏదో బదులిచ్చినా ముఖం అయిష్టంగానే పెట్టాడు.

''ముఖమలా పెడితే చూడ్డానికి బాగోలేదు. ఎన్నో మంచి పన్లు చేసావు. నాతో మాట్లాడ్డమూ అలాంటిదే అనుకుని చిన్న స్మైల్ తెచ్చుకో. నాకూ హుషారుగా ఉంటుంది'' అన్నాను మరి కాస్త చనువుగా.

నరసయ్య ఇబ్బందిగానే ''నేనేం మంచి పన్లు చేసానూ?'' అన్నాడు.

''నీ పినతండ్రి కొడుక్కి ఆస్తిలో అదనపు వాటా ఇచ్చావు. చిన్నప్పటి నీ టీచరు కూతురు పెళ్లికి పదివేలు సాయం చేసావు. ఆఫీసులో లంచానికి ఆశపడకుండా పేదవారికి న్యాయం చేస్తున్నావు. ఎన్నని చెప్పను?'' అంటూ అతడి వంక ఆరాధనాపూర్వకంగా చూసాను.

అతడి ముఖం ప్రసన్నమైంది, ''ఇప్పుడవన్నీ ఎందుకూ?'' అన్నాడు మొహమాటంగా.

''నాకూ నీకులా మంచిగా ఉండాలనుంది. కానీ మంచికివి రోజులు కావంటారు. నువ్వేమంటావో వినాలనుంది. నువ్వు నాకు ఆదర్శం'' అన్నాను.

ప్రేమకు మన్మథాస్త్రంలా స్నేహానికి ప్రశంసాస్త్రం పనిచేస్తుంది.

నరసయ్యకు ఛాతీ ఉబ్బింది. ముఖంలో గర్వంతోపాటు ఆత్మీయతా భావమూ వెలిసింది. నా వంక అభిమానంగా చూస్తూ, ''మానవమాత్రులం. మంచిచెడ్డలెంచడం మన వల్ల కాదు. ఏం చేసినా దేవుణ్ణి నమ్ము. అన్నీ ఆయనే చూసుకుంటాడు. మనకు సమస్యలుండవు'' అన్నాడతడు.

''దేవుడు ఊహ. సమస్యలు నిజం. నిజాన్ని ఊహకెలా విడిచిపెడతాం?'' అన్నాను.

''నాకు దేవుడు నిజం. సమస్యలే ఊహ'' అన్నాడు నరసయ్య.

''అంటే దేవుడున్నాడనే నీ అభిప్రాయం. అందుకు నిదర్శనాలున్నాయా?'' అన్నాను.

''ఒకటా, రెండా- బోలెడు నిదర్శనాలు. మూడేళ్ళ క్రితం మా నాన్నకు పెద్ద జబ్బు చేసింది. డాక్టర్లు పెదవి విరిచేసి అన్ని ఆశలూ వదులుకున్నాక నేను దేవుణ్ణి ప్రార్థించాను. నాన్న బ్రతికాడు. ఆయనెలా బ్రతికాడో తెలియక డాక్టర్లు తికమక పడ్డారు. కానీ నాకు తెలుసు- దేవుడే ఆయన్ను బ్రతికించాడని'' చెబుతుంటే అతడి కళ్లలో భక్తిభావంతో కూడిన మెరుపు.

కానీ నాకు తెలుసు- అతడి తండ్రి ఎలా బ్రతికాడో! డాక్టర్లాయనకు సరైన మందులే వాడారు కానీ ఆయన శరీరతత్వానికి అవి కాస్త ఆలస్యంగా పనిచేస్తాయని వాళ్లకూ తెలియదు. తాము వాడిన మందులు అనుకున్న టైముకి పనిచేయకపోవడంతో వాళ్లు కలవరపడ్డారు. నరసయ్య తండ్రిని తామే బ్రతికించామని తెలుసుకోలేక ఆ డాక్టర్లూ నాకు భక్తులయ్యారు.

''అంటే నీ ప్రార్థన ఫలిస్తే దేవుడున్నట్టు- లేదూ దేవుడు లేనట్టు- అంటే మీ నాన్న విషయంలో దేవుడున్నాడు. ప్రతిభ విషయంలో లేడు, అంతేనా?'' అన్నాను.

ప్రతిభ- నరసయ్య చెల్లెలు. పదేళ్ల క్రితం చనిపోయిందామె.

ప్రతిభ పేరు వినగానే గతస్మృతులు విషాదాన్ని నింపాయేమో అతడు కాసేపు మౌనం వహించాడు.


హెచ్. ఐ.వి. /ఎయిడ్స్‌కు
మందు ఉందా? ఉంది...

మీరుగాని, మీ డాక్టర్‌తోగాని వచ్చి నిజనిర్ధారణ చేసుకుని, 15 రోజులలోనే 25 శాతం (4వ వంతు) ఖచ్చితంగా లక్షణములు తగ్గించుకుని మంచి ఆకలిని, నిద్రను పొంది, భయము, ఆందోళన, ఆవేదన తగ్గించుకుని క్రమేణా కంట్రోల్, నార్మల్, నెగెటివ్ మీకు ఏది కావాలో మీరే పొందండి.


డా॥ పి.యస్ వి. సత్యనారాయణ
(ఆయుర్వేద & హోమియోఫిజిషియన్)
Expert Physician for AIDS, Cancer

ఎయిడ్స్ వ్యాధికి చికిత్స పొంది
నెగెటివ్ పొందినవారి వివరాలు

1. ఎ.వి.కుమార్ : (21 సం॥లు) 2-1-99 నుండి 1-5-99 వరకు వైద్యము పొంది 6 నెలల్లో హెచ్.ఐ.వి. నుండి నెగెటివ్ వచ్చింది.
2. కీరవాణి : 1 సం॥ 6 నెలల పాప తల్లిదండ్రుల నుంచి సంక్రమించిన ఎయిడ్స్ వ్యాధికి 10-1-99 నుండి 9-2-99 అనగా చికిత్స పొంది 11 నెలలలోపు నెగెటివ్ పొందింది.
3. శైలజ : (20 సం॥లు) 29-3-98 నుండి 28-7-99 వరకు చికిత్స పొంది 9-7-99 అనగా చికిత్స పూర్తయ్యేలోగా 19 రోజుల ముందుగా నెగెటివ్ వచ్చింది.
4. రమ.౫ : (45సం॥లు) 28-10-98 నుండి 27-2-99 వరకు చికిత్స పొంది కేవలం 2 నెలల్లో నెగెటివ్ పొందినారు.
5. రవళి : (18 సం॥లు) 11-2-2000 నుండి 10-6-2000 వరకు చికిత్స పొందింది. 10-5-2000 అనగా 3 నెలల్లోనే నెగెటివ్ పొందింది.
6. వెంకట్రామిరెడ్డి : (21 సం॥లు) 9-5-2000 నుండి 8-9-2000 వరకు చికిత్స పొంది 9-9-2000 వరకు నెగెటివ్ ఫలితం పొందినారు.


డా॥ పి.యస్ వి. కృష్ణ
వైద్యనిపుణులు(ఆయుర్వేద)

(పైన తెలిపిన వివరములతో పాటు ఇంకా మా ఆసుపత్రిలో ఎయిడ్స్ వ్యాధికి చికిత్స పొందిన 1200 మంది వివరాలు కూడా పూర్తి రుజువులతో తెలుసుకొనవచ్చును)
ఇండియాలో 1200 కేసులు సక్సెస్ చేసిన ఏకైక సంస్థ
ఫ్రీ కన్సల్‌టేషన్ క్యాన్సర్, హెర్పిస్, హెపటైటిస్ బి, ఆస్తమా మూర్ఛ, చర్మము, మున్నగు వ్యాధులకు సంప్రదించండి. జాండిస్, ఫైల్స్, డాగ్ బైట్స్, యోగా మెడిటేషన్ ఉచితంగా పొందండి

జి.పి. ఇన్‌స్టిట్యూట్ (హాస్పటల్) ఆఫ్ ఆల్టర్‌నేటివ్ థెరపీస్ అండ్ రీసెర్చ్ సెంటర్
ఇ.నెం. 1-8-499/6, శ్రీ వెంకటేశ్వరస్వామి గుడి వీధి, చిక్కడపల్లి, హైదరాబాద్ - 20. ఫోన్: 55615411, 27646916, సెల్: 9849007228
www.gpinstitute.com E.mail:gphospitals@sify.com & drpsvs@sify.com

అప్పుడు నేను, ''నేడో రేపో అన్నట్టున్న ముసలాయన్ను రక్షించడానికి మిరకిల్ చేసాడు. నిండా ముప్పై ఏళ్లు లేని నీ చెల్లెలికి అకాలమరణం విధించాడు. నువ్వింకా దేవుణ్ణే నమ్ముతున్నావా?'' అన్నాను కాస్త ఆవేశంగా.

అతడు నెమ్మదిగా- ''నీకు నా గురించి చాలా తెలుసు. కానీ దేవుడి గురించే బొత్తిగా తెలియదు. దేవుణ్ణే నమ్మే నాకే ఆయన లీలలు అంత సులభంగా అర్థం కావు. ఐనా నా అవగాహన మేరకు చెబుతాను, విను'' అన్నాడు.

నరసయ్య ఇప్పటికీ తండ్రి సలహాలమీదే సంసార రథాన్ని నడిపిస్తున్నాడు. పిల్లలు మరికాస్త పెద్ద వాళ్లయ్యేదాకా అతడికాయన సలహాలు కావాలి. అది తెలిసే దేవుడు తండ్రి ఆయువు పెంచి నరసయ్యకు సాయపడ్డాడు.

ప్రతిభ విషయానికొస్తే- ఆమెకు పెళ్లయి వెళ్లిపోయాక ఆ అన్నాచెల్లెళ్లిద్దరూ ఒకరు లేకుండా ఒకరు బ్రతకడానికి అలవాటు పడ్డారు. ఇక వారిద్దరిదీ మానసికానుబంధమే తప్ప ఆమె ఉనికికీ అతడి మనుగడకూ ముడిలేదు. అందుకే దేవుడు నరసయ్య కోసం ఆమెను బ్రతికించలేదు.

''అంటే దేవుడికి న్యాయాన్యాయాలు లేవు. భక్తుడి స్వార్థమే ఆయనకు ముఖ్యం! నీ సంజాయిషీ వింటే ఆ దేవుడికే మనసు చివుక్కుమనొచ్చు'' అంటూ నా ఇబ్బంది చెప్పి అతణ్ణి నిలదీసాను.

''నువ్వు నన్ను తప్పుగా అర్థం చేసుకున్నావు. న్యాయాన్యాయాలు ఎంచడంలో మనమూ పరమాత్మను మించలేమని నా ఉద్దేశం. ప్రార్థన సత్ఫలితాన్నిస్తే దేవుడున్నట్టూ, ఇవ్వకపోతే దేవుడు లేనట్టూ అనడం భక్తి కాదు. ఫలితమేదైనా అదే దైవనిర్ణయంగా భావించి గౌరవించడమే దైవభక్తి. అలాంటి భక్తులకే దేవుడు సాయపడతాడు. ప్రతిభ అంటే మా బావకు ప్రాణం. అతడి కుటుంబానికీ దాని అవసరం చాలా ఉంది. ఐనా దానికి జబ్బు చేస్తే మా బావ దానికోసం దైవప్రార్థనలు చేయలేదు సరికదా దేవుడంటూ ఉంటే దానికలాంటి జబ్బెందుకు రావాలీ అని ఎదురు ప్రశ్నలు వేసాడు. మా బావ నాస్తికుడు. అందుకే దేవుడతణ్ణే శిక్షించాడు. దేవుణ్ణే నమ్మనివాడితో ప్రతిభ పెళ్లి జరిపించడం నా తప్పు. దానికి దేవుడెలా బాధ్యుడు?'' అన్నాడు నరసయ్య.

అంటే దేవుడు రాజకీయవేత్త. భక్తుల పార్టీ నాయకుడు. ఇతర పార్టీలవారికి ఆయన వల్ల న్యాయం జరగదు. నాయకులను గుడ్డిగా నమ్ముతూ వారిని పొగడ్తలతో ముంచెత్తే అనుచరులు- నాయకులకే సిగ్గుచేటు కావడం రాజకీయ భారతంలో మామూలే. కానీ అందువల్ల నాయకులకూ, అనుచరులకూ కూడా కలిగే నష్టమేమీ లేకపోవడంతో- ఆ సంప్రదాయం అలాగే కొనసాగుతోంది.

దేవుడికీ భక్తులకూ ఉన్న సంబంధాన్ని ఆ స్థాయికి దిగజార్చడం నాకు అసంతృప్తిని కలిగించగా- అతడితో మరికాసేపు దేవుడికి వ్యతిరేకంగా వాదించాను.

ఐనా అతడికి కోపమన్నదే రాలేదు. తనకు జరిగిన మంచి అంతా దేవుడి వల్లనే అని నొక్కి చెబుతాడు. తన ప్రార్థన ఫలించకపోతే అందుకు వేరే కారణముందంటాడు. దేవుణ్ణే నమ్మకూడని సంఘటన తన జీవితంలో ఒక్కటీ జరగలేదంటాడు.

అతడి ముందు నా వాదనలన్నీ బూడిదలో పోసిన పన్నీరయ్యాయి. నేను విసుగు నటిస్తూ ''తర్కాన్ని వదిలి- నమ్మకం మీద ఆధారపడిన వారంతా ఇలాగే అంటారు'' అన్నాను.

''నువ్వేమైనా అనుకో. నేను దేవుణ్ణే నమ్ముతాను. నమ్ముతూనే ఉంటాను'' అన్నాడతడు అదే చివరి మాటన్నట్టు.

''ఇంతలా నమ్ముతున్నావంటే నువ్వు దేవుణ్ణే చూసే ఉంటావు. ఎలా ఉంటాడో నాకు కాస్త చెబుతావా?'' అన్నాను వెటకారంగా.


అతడు నా వెటకారానికి చలించలేదు. కానీ ఉన్నట్టుండి మనిషి చప్పబడిపోయి, ''నువ్వంత సింపుల్‌గా అనేసావు కానీ దేవుణ్ణే చూడ్డమనేది మామూలు అదృష్టం కాదు. నాకైతే ఈ జన్మకా అదృష్టం పడుతుందనుకోను'' అన్నాడు.

'దొరికేవులే నాయనా' అని మనసులో అనుకుని, ''మరి ఒక్కసారి కూడా చూడని వాణ్ణే ఉన్నాడని ఎలా నమ్ముతున్నావ్?'' అన్నాను. అది ప్రశ్న కాదు, సవాలు.

తడుముకుంటాడనుకున్నాను కానీ అతడి తీరు చూస్తుంటే నా నుంచి ఈ ప్రశ్న ఎప్పుడొస్తుందా అని ఎదురుచూస్తున్నట్టుంది. ''గాలిని ఊపిరి పీల్చుతూ

## సమీరానందం

**తెలుగు సినిమాల్లో నటించి మెప్పించడం అంత ఆషామాషీ వ్యవహారం కాదని తెలుసుకున్నట్టుంది సమీరారెడ్డి. ఈ డేర్ అండ్ డ్యాషింగ్ హీరోయిన్ ఇప్పుడు మళ్లీ ఎన్‌టిఆర్ జూనియర్‌తో కలిసి నటిస్తోంది. ఈ చిత్రంతో పాటూ చిరంజీవి చిత్రం జై చిరంజీవలో భూమికతో పాటూ కలిసి నటిస్తోంది. వినాయకునిపై ఎంతో వ్యయప్రయాసలకోర్చి చిత్రీకరించిన పాట ఈ చిత్రానికి హైలైట్ అవుతుందంటున్నారు. ఈ పాట చిత్రం ప్రారంభంలోనే వస్తుందంటున్నారు. ఈ చిత్రం తర్వాతైనా ఈ భామ బిజీగా మారుతుందేమో చూడాలి.**



గుర్తిస్తాం. కరెంటును దీపం వెలుగులో, ఫాను గాలిలో, హీటరు వేడిలో ఇంకా ఎన్నో పనిముట్ల ద్వారా ఫీలవుతాం. రుచిని నాలిక చెప్పాలి. శబ్దాన్ని చెవులు వినాలి. పరిమళం ముక్కుపుటాలకు సోకాలి. ఇలా ఈ ప్రపంచంలో కంటికి కనిపించని పరమసత్యాలు చాలా ఉన్నాయి. నాకు దేవుడు వీట న్నింటినీ మించిన స్పష్టమైన గొప్ప అనుభూతి'' అన్నాడు.

అతడి జవాబుకు నా సవాలు వీగిపోయింది. అప్పుడు నాకు కలిగిన ఆనందమింతా అంతా కాదు. ప్రథమ ప్రయత్నంలోనే నాక్కావాల్సిన వ్యక్తిని గుర్తించానంటే నాలో నిజంగానే మనిషి ఊహించినంత గొప్పతనమూ ఉండి ఉండాలనుకు న్నాను.

నరసయ్య వంక అబ్బురంగా చూస్తూ, ''నీ నమ్మకం అపూర్వం. నీవంటివాడికి దర్శనమిస్తే దేవుడి జన్మ కూడా ధన్యమవుతుంది'' అన్నాను.

''దేవుడికి జన్మ ఏమిటి? అర్థం లేకుండా మాట్లాడకు'' అన్నాడతడు నన్ను ప్రేమగా మందలిస్తూ.

అబద్ధమెందుకూ- నన్నంతగా ఆరాధి స్తున్న అతడికి నేనే దేవుణ్ణని చెప్పేయాలని తహతహగా ఉంది. అందుకని, ''నీకు దర్శ నమివ్వాలంటే దేవుడైనా జన్మ ఎత్తక తప్పదు. మరి నీకు దేవుణ్ణి చూడాల నుందా?'' అన్నాను.

అనేసాక చూడాలని లేదనేస్తాడేమోనని బెంగ. మరి నాకు మనిషి శరీరంమీదే కానీ మనసుపై అదుపు లేదుగా!

నరసయ్య ''ఊ'' అనడమే కాదు, ఆ వెంటనే, ''నేను చూడాలనుకుంటే వెంటనే కనిపిస్తాడా?'' అన్నాడు ఆత్రుతగా.

''అదేమిటీ- నువ్వాయన భక్తుడివి. కన పడమని ప్రార్థిస్తే ఆయన ప్రత్యక్షమై నీ కోర్కె తీర్చడా?'' అన్నాను ఆశ్చర్యం నటిస్తూ.

అతడు కాస్త తడబడినా ఆ వెంటనే తమాయిం చుకుని, ''ఏమో, నేనాయన్ను కనపడమని ఎప్పుడూ అడగలేదు. అడగనేమో కూడా! ఐనా కొన్ని ఆయన నిర్ణయానికే విడిచి పెట్టాలి. నాకు యోగముంటే అడక్కుండానే ఆయన నా ముందు ప్రత్యక్షమవుతాడు'' అన్నాడు.

అర్థమైంది నాకు. భ్రమలో జీవించే మనిషికి భ్రమ నుంచి బయటపడడం ఇష్టం ఉండదు. దేవుణ్ణి నమ్మాలనుకున్నవాడు తన నమ్మకాన్ని దెబ్బతీసే భ్రమల నుంచి బయటపడాలనుకోడు. నరసయ్యకు దేవుణ్ణి చూడాలని ఉంది. కానీ అది సాధ్యమన్న నమ్మకం లేదు.

ఇక నరసయ్యకు నేనెవరో చెప్పాల్సిన సమయం వచ్చిందనుకున్నాను.

''నరసయ్యా! నీకు యోగముంది. నేనే దేవుణ్ణి. నీకు దర్శనమివ్వాలని వచ్చాను'' అన్నాను ప్రతి అక్షరాన్నీ ఒత్తి పలుకుతూ.

నరసయ్య తెల్లబోయి నా వంక అదోలా పరీక్షగా చూసాడు. తర్వాత పెద్దగా నవ్వేసి, ''నువ్వెవరివో కానీ నన్ను ఆటపట్టిస్తున్నావు'' అన్నాడు.

''నన్ను నమ్ము. తీరదనుకున్న నీ కోరిక ఈరోజు తీరుతోంది. నేనే దేవుణ్ణి. నన్ను తనివి తీరా చూసుకో'' అన్నాను.

నరసయ్య కళ్ళు ఎర్రబడ్డాయి. నీ బ్రతుక్కి నువ్వు దేవుడివా అన్నట్టు నావంక చూసి ఏదో అన బోయాడు. అతడు నన్ను దుర్భాషలాడబోతు న్నట్టు గ్రహించి, ''నేను దేవుణ్ణి. నువ్వేమనబోతు న్నదీ నాకు ముందుగానే తెలిసిపోతుంది'' అంటూ అతడు అనబోయే మాటలు కూడా ముందుగానే చెప్పి, ''నోటిని అదుపుచేసుకో. లేకుంటే ఆ తర్వాత దేవుణ్ణి దుర్భాషలాడినందుకు జీవితాంతం బాధపడతావ్'' అంటూ సెంటిమెంటు మీద దెబ్బ కొట్టాను.

నరసయ్య భయపడ్డాడు. వెంటనే, ''నాకెందు కులే- ఎవరి పాపం వారినే కొడుతుంది. అన్నింటికీ ఆ దేవుడే ఉన్నాడు'' అనేసి ఊరుకున్నాడు.

''ఆ దేవుణ్ణే నేను. నీ భక్తికి మెచ్చాను. కాబట్టి నీకు నమ్మకం కలిగించే ఇక్కణ్ణించి వెళతాను'' అంటూ అతడికి నమ్మకం కలిగించాలని- అప్పుడు నేనా పూలతోటలోని ఇతర జనాన్ని మాయం చేసాను. గాల్లో తేలాను. గాలివాన సృష్టించి మేము తడవకుండా తోట మాత్రం తడి సేలా చేసాను. కనీవినీ ఎరుగని వంటకాలు సృష్టిం చాను. అన్నీ అద్భుతమని మెచ్చుకున్నాడు నరసయ్య.

''దేవుణ్ణి కదా, అందుకే నాకీ అద్భు తాలు సాధ్యమయ్యాయి'' అన్నాను.

''నువ్వు దేవుడివి కాదు, ఐంద్రజాలి కుడివి'' అన్నాడతడు.

నా మహిమలను అతడు నమ్మలేదని గ్రహించి, ''నువ్వు గుడికి వస్తూ దారిలో ఓ పుస్తకం కొన్నావు. అందులో ఏముందో చెబుతాను. పుస్తకం తియ్'' అన్నాను.

నరసయ్య తన పక్కనే ఉన్న సంచి లోంచి ఆ పుస్తకం తీసాడు. పేజీలు తెరిచి కుతూహలంగా నా వైపు చూసాడు. నేను ఏ పేజీలో ఏముందో చెబుతూంటే ''నువ్వు కరెక్టుగా చెబుతున్నావు. అంటే ఈ పుస్తకాన్ని ఇప్పటికే చదివేసి ఉంటావు. నీ జ్ఞాపకశక్తి చాలా గొప్పదే కానీ అంత మాత్రాన నువ్వు దేవుడివైపోవు. మను షుల్లో కూడా ఇది అసాధ్యమూ కాదు, అరుదూ కాదు'' అన్నాడు.

''పోనీ నరస విలాసంలోని విశేషాలు చెప్పనా?'' అన్నాను.

''నరస విలాసమా- అదేమిటి?'' అన్నాడతడు.

నరసయ్య తన జీవితంలోని కొన్ని ముఖ్య విశేషాలకు అక్షర రూపమిస్తూ

## ఆనందం

***తాము నటించిన చిత్రాలు హిట్ అయితే హీరో, హీరో యిన్లు ఎంతో హేపీగా ఫీలవుతారు. 'ది వర్త్ రేస్ అగైనిస్ట్ టైం' చిత్రం 25 వారాల్లో 55 కోట్లకు పైగా వసూలు చేసింది. అమితాబ్ బచ్చన్, అక్షయ్‌కుమార్, ప్రియాంకా చోప్రా, షెఫాలీషా, రాజ్‌పాల్‌యాదవ్ తదితరులు నటించిన ఈ చిత్రం మంచి కథతో అన్నివర్గాల వారిని అలరించడం బ్లాక్ బస్టర్ మూవీ ఎంటర్‌టైనర్స్‌ని ఆనందసాగరంలో ముంచెత్తింది. త్వరలో ప్రియాంకాచోప్రాతో కలిసి ఓ సినిమా నిర్మించాలని ఈ బ్యానర్ నిర్ణయించిందిట. మొత్తానికి ప్రియాంకా లక్కీ హీరోయిన్ అని చెప్పాలి.***



దానికి నరస విలాసమని పేరు పెట్టాడు. అతడా పుస్తకం వ్రాస్తున్నట్టు అతడి భార్యకు కూడా తెలియదు. అలాంటప్పుడు ఆ పుస్తకం గురించి నాకు తెలుస్తుందనుకోలేడు కదా!

నేను నరసయ్యకు ఆ పుస్తకంలోని కొన్ని విశేషాలు చెప్పి, ''ఇవి నీకూ నీ భార్యకూ సంబంధంచిన వ్యక్తిగత శృంగార విశేషాలు. వీటిని బయటపెట్టడాన్నామె ఒప్పదని నీ అనుమానం. అవునా?'' అన్నాను.

తెల్లబోయిన నరసయ్య ముఖం అంతలోనే ఎర్రబడింది. ''ఇది చెప్పడానికా నువ్వు ఇందాకట్నించి దేవుడినంటూ నాటకమాడుతున్నావు? ఆ పుస్తకం గురించి నీకెలా తెలిసిందో చెప్పు'' అంటూ నన్ను గద్దించాడు.

''చెప్పానుగా.. నేను దేవుణ్ణని! ఆ పుస్తకమేమిటి- నేను నీ గురించిన గతం, వర్తమానం, భవిష్యత్తూ వగైరాలన్నీ చెప్పగలను'' అంటూ నేనతడి గతానికి సంబంధించిన ఎన్నో విశేషాలు చెప్పాను. అతడు ఆశ్చర్యంగా విన్నాడు కానీ నేను దేవుణ్ణని ఒప్పుకోలేదు.

''ఐతే రేపేమవుతుందో చెబుతాను. అలాగే జరిగితే నన్ను నమ్ముతావా?'' అన్నాను.

''నువ్వు రేపటి సంగతి చెబుతున్నావు. కానీ ఇప్పుడు జరుగుతున్నవన్నీ కొన్ని వందల ఏళ్లకు ముందే చెప్పిన వారున్నారు. నువ్వు చెప్పింది జరిగితే నువ్వో గొప్ప జ్యోతిష్కుడివనుకుంటాను తప్ప దేవుడివని మాత్రం అనుకోను'' అన్నాడతడు.

నేను ఆశ్చర్యంగా అతడి వంక చూసి- ''మరి నీకు నీ భవిష్యత్తు తెలుసుకోవాలన్న కుతూహలం లేదా?'' అన్నాను.

''దేవుణ్ణి నమ్మినవాడు తన భవిష్యత్తు తెలుసుకోవాలనుకోడు. దైవనిర్ణయానికే విడిచిపెడతాడు''

''నీ దైవభక్తి ప్రశంసనీయం. నన్నేదైనా వరమడుగు, ఇస్తాను''

''నేను దేవుణ్ణి మాత్రమే వరాలడుగుతాను'' అన్నాడతడు నిర్లక్ష్యంగా.

''పోనీ దేవుణ్ణే అడుగు. నువ్వు మనసులో అనుకుంటే చాలు అది నాకు తెలిసిపోతుంది''

అతడు నా వంక ఆశ్చర్యంగా చూసి, ''ఎవర్నువ్వు? ఎందుకిలా దేవుడినంటూ వెంటబడి నన్ను వేధిస్తున్నావు?'' అన్నాడు.

''నేను నిజంగా దేవుణ్ణే. నువ్వు నన్ను నమ్మితే నీ ద్వారా మానవాళికెంతో మేలు చేయాలనుకుంటున్నాను. వెతుక్కుంటూ వచ్చిన అవకాశాన్ని వదులుకోకు. ఏదైనా వరం కోరుకో'' అన్నాను.

ఏమనుకున్నాడో మరి- కళ్లు మూసుకుని, ''ఒక్కరోజులో నేను కోటీశ్వరుణ్ణి కావాలి'' అనుకున్నాడతడు.

''ఓస్.. ఇంతేనా! రేపు సాయంత్రానికల్లా నువ్వు కోటీశ్వరుడివైపోతావు. కానీ ముందు నీవు నన్ను దేవుణ్ణని నమ్మాలి'' అన్నాను.

నరసయ్య నమ్మలేనట్టు నా వంక చూసాడు. ''నువ్వు హిప్నాటిస్టువి. థాట్ రీడింగ్‌తో నా మనసులో మాట చెప్పావు. అంతవరకూ బాగానే వుంది. కానీ ఒక్కరోజులో నన్ను కోటీశ్వరుణ్ణెలా చెయ్యగలవో చెప్పు'' అన్నాడు.

''రేపు నీ ఇంటికి ఓ వ్యక్తి వస్తాడు. నరస విలాసం కథను చలనచిత్రంగా మలచడానికి గ్లోబల్ రైట్స్ కావాలంటాడు. నువ్వడిగితే కోటిన్నర దాకా ఇస్తాడు''

''ఆ పుస్తకానికి అంత డబ్బా?'' అంటూ నోరు తెరిచాడు నరసయ్య.

''మరి దేవుడా? మజాకా?'' అన్నాను.

ఉన్నట్టుండి నరసయ్య ముఖంలో భయం, ''నీకు చాలా పెద్ద కనెక్షన్సే ఉన్నాయి. నువ్వు నన్ను కలుసుకోవడం వెనుక ఏదో పెద్ద కుట్ర ఉంది. నువ్వు సామాన్యుడివి కాదు. నేను సామాన్యుణ్ణి. నన్ను నా మానాన బ్రతకనిచ్చి నువ్వు నీ స్థాయి మనిషిని వెతుక్కో'' అంటూ అతడు చటుక్కున లేచి నిలబడ్డాడు. నేను వారించేలోగా అక్కడి నుంచి వెళ్లిపోయాడు.

ఆపరేషన్ నరసయ్య- ఫెయిల్! నా ప్రయత్నానికి ఆదిలోనే హంసపాదు.

నేనింకా అక్కడే కూర్చున్నాను. మనిషి నాకోసం కట్టిన ఆ గుడి ఆవరణలో- నాకు పూజలు జరగొచ్చు కానీ నా భక్తులు కూడా నన్ను నన్నుగా గుర్తించరని అర్థమైంది నాకు.

విజ్ఞానం అత్యున్నతస్థాయికి చేరుకున్న నేటి రోజుల్లో కూడా మనిషి ఆలోచనలు అవాంఛనీయ మార్గాల్లో పయనించడానికి కారణం అప్పుడు నాకు తెలిసింది.

నన్ను చూడనప్పుడు నేను లేననడానికి ఎన్ని నిదర్శనాలు చూపినా నరసయ్య నేను లేనని నమ్మలేదు. నేను కనపడినప్పుడు ఎన్ని నిదర్శనాలు చూపినా నేనే దేవుణ్ణని అతడు నమ్మలేదు. అంటే మనుషులు కనపడని వాటినే నమ్ముతారు. కనిపించే వాటిని నమ్మరు. అందుకే వారు సాటి మనిషిలో దేవుణ్ణి చూడలేకపోతున్నారు.

దేవుడి పేరుతోనే ఐనా- మనిషి సాటి మనిషిని ద్వేషిస్తూ, హింసిస్తూ ఉన్నంతకాలం- 'కలడు కలండనెడివాడు కలడో లేడో' అన్న మీమాంస దేవుడి గురించి కొనసాగుతూనే ఉంటుంది. అందుకు సంబంధించినంత వరకూ మనుషుల విషయంలో నేను అసహాయుణ్ణి!

☆

## డైమండ్స్‌రాణి

**బంగారు ఆభరణాలంటే ఎవరికి ఇష్టం ఉండదు చెప్పండి. అందాలభామ ఐశ్వర్యారాయ్ ఇప్పుడు డైమండ్స్‌ని కలెక్ట్ చేస్తోంది. విదేశాల్లో షూటింగ్ జరిగినప్పుడల్లా ఆమె ఖాళీ టైంని డైమండ్స్ కలెక్షన్‌కి కేటాయిస్తోంది. 'అమ్మాయిలకి బంగారం మీద ఎందుకో అంత మమకారం నాకు ముందు అర్థమయ్యేది కాదు. ఇప్పుడిప్పుడే వాటికున్న ప్రాధాన్యత ఏంటో అర్థం అవుతోంది. అందుకే నేను కూడా డైమండ్స్‌ని బాగా కలెక్ట్ చేస్తున్నాను' అని ఆనందంగా చెబుతోంది. డైమండ్స్ వేసుకుంటే ఈమెకి మెరుపు వస్తుందా, లేక వాటికి మెరుపు వస్తుందా?**

